# మనం







## నిజామాబాద్ కామారెడ్డి

మంగళవారం । 13 । అక్టోబర్ । 2026 పేజీలు: 5


# పనిమనిషి ముసుగులో దోపిడీ, హత్య




- భర్తతో కలిసి వృద్ధురాలి హత్య.. 8 తులాల బంగారం దోపిడీ.
- కామారెడ్డిలో సంచలనం సృష్టించిన కేసును ఛేదించిన పోలీసులు, మంగళసూత్రం, ఆభరణాలు స్వాధీనం.
- గతంలోనూ మరో ఇంట్లో బంగారు ఆభరణాల చోరీ చేసినట్లు విచారణలో వెల్లడి.
- కేసును ఛేదించిన పోలీసు బృందాన్ని అభినందించిన జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్ర.


2


# ఎల్‌నినో ఎఫెక్ట్.. ప్రత్యామ్నాయ పంటలే రైతుకు బాసట!

- నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక చేసి, ప్రత్యామ్నాయ సాగుతో అధిక ఆదాయం పొందాలి.
- జిల్లాలో సగటున నాలుగు మీటర్లు తగ్గిన భూగర్భ జలమట్టాలు.
- 72 రైతు వేదికల్లో 5 వేల మందితో అవగాహన సమావేశాలు: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.





2




కామారెడ్డి, అక్టోబరు 12(మనం న్యూస్): వర్షాభావ పరిస్థితులు, ఎల్నినో ప్రభావం నేపథ్యంలో రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు బదులుగా చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల సాగుకు ప్రాధాన్యమివ్వాలన్నారు. సోమవారం చిన్నమల్లారెడ్డి రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ., జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలమట్టాలు సగటున నాలుగు మీటర్ల మేర తగ్గాయని తెలిపారు.

# ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ సమరభేరి



- 'చలో ఢిల్లీ' నిరసనలో సీఎం రేవంత్రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్.
- ఎస్ఐఆర్ ప్రక్రియలో అవకతవకలపై, ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామాకు డిమాండ్.
- ఢిల్లీ నిరసనలో పాల్గొన్న తెలంగాణ కాంగ్రెస్ ముఖ్య నేతలు.


3


# సీఈసీ రాజీనామా చేయాలి.. ఢిల్లీలో ఇండియా కూటమి మహా నిరసన




## ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి


3


నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 12 (మనం న్యూస్): భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో సోమవారం దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన మహా నిరసన ర్యాలీలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి పాల్గొన్నారు.

# ఎల్‌నినో ఎఫెక్ట్.. ప్రత్యామ్నాయ పంటలే రైతుకు బాసట!

- నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక చేసి, ప్రత్యామ్నాయ సాగుతో అధిక ఆదాయం పొందాలి.
- జిల్లాలో సగటున నాలుగు మీటర్లు తగ్గిన భూగర్భ జలమట్టాలు.
- 72 రైతు వేదికల్లో 5 వేల మందితో అవగాహన సమావేశాలు: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.







కామారెడ్డి, అక్టోబరు 12(మనం న్యూస్): వర్షాభావ పరిస్థితులు, ఎల్నినో ప్రభావం నేపథ్యంలో రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు బదులుగా చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల సాగుకు ప్రాధాన్యమివ్వాలన్నారు. సోమవారం చిన్నమల్లారెడ్డి రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ., జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలమట్టాలు సగటున నాలుగు మీటర్ల మేర తగ్గాయని తెలిపారు. రైతులు కంది, పెసర, మినుము, శనగ, వేరుశనగ, పొద్దుతిరుగుడు, జొన్న, మొక్కజొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలను నేల స్వభావం, నీటి లభ్యత ఆధారంగా సాగు చేయాలని సూచించారు. జిల్లాలోని 72 రైతు వేదికల్లో నిర్వహించిన సమావేశాల్లో సుమారు 5 వేల మంది రైతులు, 200 మంది ప్రజాప్రతినిధులు పాల్గొని పంటల ప్రణాళిక, నీటి సంరక్షణపై చర్చించినట్లు వెల్లడించారు.

## డ్రాగన్ ఫ్రూట్, పామాయిల్ అంతర పంటలతో అదనపు ఆదాయం

రైతు శ్రీకాంత్ మూడు ఎకరాల్లో పసుపు, ఉల్లిగడ్డ, కూరగాయలు, పెసర్లు, డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తూ సమగ్ర వ్యవసాయ విధానాలను అనుసరిస్తున్నారని కలెక్టర్ వివరించారు. అర ఎకరంలో సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ ద్వారా మొదటి ఏడాది రూ.1.50 లక్షలు, రెండో ఏడాది రూ.3 లక్షలు, మూడో ఏడాది నుంచి సుమారు రూ.5 లక్షల ఆదాయం వస్తున్నట్లు రైతు తెలిపారని పేర్కొన్నారు. వర్షపు నీటిని నిల్వ చేసేందుకు కుంట, నేల సారాన్ని పెంచేందుకు పచ్చిరొట్ట ఎరువుల వినియోగం వంటి పద్ధతులు ఉపయోగకరమన్నారు.

## అంతర పంటలుగా సాగుతో అదనపు ఆదాయం

గాంధారి మండలం గుడిమెట్ల గ్రామంలో ఓ రైతు పామాయిల్ తోటలో పత్తి, మునగ, కంది, బంతిపూలను అంతర పంటలుగా సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందుతున్నట్లు తెలిపారు. నీటి కొరతతో వరి సాగును తగ్గించి, రానున్న యాసంగిలో మిగిలిన ఎకరంలోనూ మునగ సాగు చేయాలని నిర్ణయించినట్లు వివరించారు.

## ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కూడా రైతు నేస్తం కార్యక్రమంలో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని సూచించినట్లు అధికారులు తెలిపారు. సహజ వ్యవసాయం, పంటల వైవిధ్యం, నీటి సంరక్షణతో పెట్టుబడులు తగ్గించి ఆదాయం పెంచుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ధర్మగోని లక్ష్మి, వ్యవసాయ అధికారి మోహన్రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి జ్యోతి, తహసీల్దార్ హిమబిందు, డీఆర్డీవో దామోదర్రెడ్డి, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# పనిమనిషి ముసుగులో దోపిడీ, హత్య

- భర్తతో కలిసి వృద్ధురాలి హత్య..
8 తులాల బంగారం దోపిడీ.
- కామారెడ్డిలో సంచలనం సృష్టించిన కేసును ఛేదించిన పోలీసులు, మంగళసూత్రం, ఆభరణాలు స్వాధీనం.
- గతంలోనూ మరో ఇంట్లో బంగారు ఆభరణాల చోరీ చేసినట్లు విచారణలో వెల్లడి.
- కేసును ఛేదించిన పోలీసు బృందాన్ని అభినందించిన జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్ర.




కామారెడ్డి, అక్టోబరు 12(మనం న్యూస్): కామారెడ్డి పట్టణ కేంద్రంలో సంచలనం సృష్టించిన వృద్ధురాలి హత్య, బంగారు ఆభరణాల దోపిడీ కేసును పట్టణ పోలీసులు ఛేదించారు. ఇంట్లో పనిమనిషిగా పనిచేస్తున్న మహిళ తన భర్తతో కలిసి పథకం ప్రకారం వృద్ధురాలిని హత్య చేసి, ఆమె ఒంటిపై ఉన్న సుమారు 8 తులాల బంగారు ఆభరణాలను అపహరించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో బతుకమ్మ కుంటకు చెందిన బోసు రజిత (40), ఆమె భర్త బోసు నర్సింగ్ (48)ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి బంగారు ఆభరణాలతో పాటు సెల్ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు.

## విద్యుత్ సరఫరా నిలిపివేసి.. గొంతు నులిమి

పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి పట్టణంలోని ముష్రీబ్బాగ్కు చెందిన చిట్మల్ అనసూయ (66) సెప్టెంబరు 29న సాయంత్రం 6 నుంచి 7.30 గంటల మధ్య హత్యకు గురయ్యారు. ఆమె భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో అనసూయ ఇంట్లో ఒంటరిగా ఉన్నారు. తిరిగి వచ్చిన భర్త ఆమె మంచంపై అపస్మారక స్థితిలో ఉండటాన్ని గమనించారు. మెడపై గాయాలు ఉండటంతో పాటు, మంగళసూత్రం, రెండు ఉంగరాలు, చెవి ఆభరణాలు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో హత్య, దోపిడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## డీఎస్పీ ఎస్. మధుసూదన్ పర్యవేక్షణ

జిల్లా ఎస్పీ ఎం. రాజేష్చంద్ర ఆదేశాల మేరకు, డీఎస్పీ ఎస్. మధుసూదన్ పర్యవేక్షణలో పట్టణ ఇన్స్పెక్టర్ బి. నరహరి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సంఘటనా స్థలంలో లభించిన ఆధారాలు, సాంకేతిక సమాచారాన్ని విశ్లేషిస్తూ దర్యాప్తు కొనసాగించారు. ఈ క్రమంలో అనసూయ ఇంట్లో పనిమనిషిగా పనిచేస్తున్న రజితపై అనుమానం రావడంతో ఆమె కదలికలపై నిఘా పెట్టారు. అనంతరం రజిత, నర్సింగ్లను గంజ్ పాఠశాల సమీపంలో అదుపులోకి తీసుకొని విచారించారు.

## ముందస్తు పథకంతో హత్య

పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో అనసూయ ఇంట్లోని బంగారు ఆభరణాలను దొంగిలించాలని భార్యాభర్తలు పథకం వేసుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. తమను అనసూయ గుర్తుపట్టే అవకాశం ఉందని భావించి ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

## పక్కా పథకంతో వృద్ధురాలి హత్య

పథకంలో భాగంగా అనసూయ భర్త బయటకు వెళ్లిన సమయంలో ఇద్దరూ ఇంట్లోకి ప్రవేశించారు. అనసూయ పూజ చేస్తుండగా విద్యుత్ సరఫరాను నిలిపివేసి, ఆమెను కిందపడేసి మరో గదిలోకి లాక్కెళ్లారు. అనంతరం తువ్వాలుతో గొంతు బిగించి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. ఆమె ధరించిన బంగారు ఆభరణాలను తీసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. అనుమానం రాకుండా రజిత యథావిధిగా పనిమనిషిగా వ్యవహరించినట్లు వివరించారు.

## గతంలోనూ చోరీ చేసినట్లు వెల్లడి

రజిత గతంలో కామారెడ్డిలోని భూమయ్య ఇంట్లో పనిమనిషిగా పనిచేసిన సమయంలోనూ బంగారు ఆభరణాలను దొంగిలించినట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. 2023 సెప్టెంబరులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుమారు నాలుగు తులాల బంగారు పుస్తెల తాడు, ఐదు గ్రాముల చెవి కమ్మలను అపహరించినట్లు పేర్కొన్నారు.

## 8 తులాల ఆభరణాలు స్వాధీనం

నిందితుల నుంచి బంగారు మంగళసూత్రం, రెండు ఉంగరాలు, చెవి ఆభరణాలు కలిపి సుమారు 8 తులాల బంగారాన్ని, రజిత సెల్ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు పోలీసులు వెల్లడించారు.



## కేసును ఛేదించిన సిఐ నరహరి, ఏఎస్ఐ రంగారావు, సిబ్బంది

ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన పట్టణ ఇన్స్పెక్టర్ బి. నరహరి, ఏఎస్ఐ రంగారావు, కానిస్టేబుళ్లు రామస్వామి, రాజు నాయక్, సంపత్లను ఎస్పీ ఎం. రాజేష్చంద్ర అభినందించారు. దర్యాప్తులో వారి పనితీరు, అంకితభావాన్ని ప్రశంసించారు.

# సీఈసీ రాజీనామా చేయాలి.. ఢిల్లీలో ఇండియా కూటమి మహా నిరసన

### ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 12 (మనం న్యూస్): భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో సోమవారం దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన మహా నిరసన ర్యాలీలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నేతృత్వంలో నిర్వహించిన ఈ నిరసన ర్యాలీలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారితో కలిసి ఎమ్మెల్యే భూపతి రెడ్డి ర్యాలీలో పాల్గొని, సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.









### ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం

ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం కల్పించడంతో పాటు ఓటర్ల హక్కులను పరిరక్షించడం ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమని నిరసనకారులు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి ఉండాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు, ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా చూడాలనే లక్ష్యంతోనే ఈ నిరసన చేపట్టినట్లు ఇండియా కూటమి నేతలు స్పష్టం చేశారు.

### ఢిల్లీ వేదికగా గళమెత్తిన కాంగ్రెస్ నేతలు

దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన ఈ మహా నిరసన ర్యాలీలో తెలంగాణ ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి పాల్గొని, సీఈసీ రాజీనామా డిమాండ్కు మద్దతుగా తన నిరసనను తెలియజేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం నిలబెట్టేలా ఎన్నికల సంఘం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఇండియా కూటమి నాయకులు డిమాండ్ చేశారు.

---

## ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ సమరభేరి

- 'చలో ఢిల్లీ' నిరసనలో సీఎం రేవంత్రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్.
- ఎస్ఐఆర్ ప్రక్రియలో అవకతవకలపై, ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామాకు డిమాండ్.
- ఢిల్లీ నిరసనలో పాల్గొన్న తెలంగాణ కాంగ్రెస్ ముఖ్య నేతలు.

కామారెడ్డి, అక్టోబరు 12(మనం న్యూస్): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా డిమాండ్, ఢిల్లీలో విపక్ష నేతల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఆధ్వర్యంలో 'చలో ఢిల్లీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసనలో తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ముఖ్య నేతలు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, ముఖ్యమంత్రి అనుముల రేవంత్రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్ గౌడ్ తదితరులు ఢిల్లీలో జరిగిన ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరితోపాటు లోక్సభ, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు, టీపీసీసీ ముఖ్య నేతలు నిరసనలో భాగస్వాములయ్యారు.





### విపక్ష నేతలపై పోలీసుల తీరును ఖండిస్తూ ఆందోళన

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, ఓటు హక్కుకు సంబంధించి ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘం నిష్పాక్షికంగా వ్యవహరించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియపై తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతోంది. అలాగే, ఢిల్లీలో విపక్ష నేతలపై పోలీసుల వ్యవహారశైలిని నిరసిస్తూ పార్టీ నేతలు ఆందోళన చేపట్టారు. జాతీయ స్థాయిలో చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ నాయకుల భాగస్వామ్యం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ పార్టీ తన నిరసనను వ్యక్తం చేసింది.

## మెండోరాలో డ్రైనేజీ పనులకు శ్రీకారం

మెండోరా, అక్టోబర్ 12 (మనం న్యూస్): మెండోరా మండల కేంద్రంలోని ఆరో వార్డు యాదవ్ కాలనీలో సోమవారం డ్రైనేజీ పనులకు ముహూర్తం నిర్వహించారు. కాలనీలో పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించి, మురుగునీటి సక్రమ పారుదలకు వీలుగా డ్రైనేజీ పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుట్టడి ప్రమోద్ కుమార్, ఉప సర్పంచ్ మిట్టపల్లి రాజేశ్వర్, వార్డు సభ్యులు మోతే గంగారెడ్డి, శీను, శంకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి జాకీర్, కారోబార్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

బోధన్ అక్టోబర్ 12 ( మనం న్యూస్) సమాచార హక్కు చట్టం 2005 అమల్లోకి వచ్చి 21 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా న్యాయ సేవా ప్రజా చైతన్య సమితి ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు.



నిజామాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్ కార్యాలయం లో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన చట్టమని, పారదర్శక పాలనకు ఈ చట్టం ఎంతో దోహదపడుతుందని అన్నారు. ప్రతి పౌరుడు ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

న్యాయ సేవా ప్రజా చైతన్య సమితి అధ్యక్షులు చాపల కిరణ్ కుమార్ మాట్లాడుతూ 2005 అక్టోబర్ 12న అమల్లోకి వచ్చిన ఈ చట్టం వల్ల సామాన్య ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో నుండి సమాచారం పొందే హక్కు కలిగిందని, అవినీతి నిర్మూలనకు ఇది ఒక బ్రహ్మాస్త్రం లాంటిదని తెలిపారు.

ఈ కార్యక్రమంలో న్యాయ సేవా ప్రజా చైతన్య సమితి రాష్ట్ర కన్వీనర్ మీర్జాపురం రామ కృష్ణ సభ్యులు కొట్టే శ్రీకాంత్ సాలూరి అనిల్ తదితరులు పాల్గొన్నారు

# రహదారులపై పంటలు ఆరబెట్టవద్దు

**రోడ్డు ప్రమాదాల నివారణకు రైతులు సహకరించాలి: ఎస్ఐ జి. మహేష్**

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 12 (మనం న్యూస్): రహదారులపై మొక్కజొన్న, వరి ధాన్యం, ఇతర పంట ఉత్పత్తులను ఆరబెట్టవద్దని జక్రాన్పల్లి ఎస్ఐ జి. మహేష్ రైతులకు సూచించారు. రహదారులపై పంటలు ఆరబెట్టడం వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.

రహదారులపై నిరంతరం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, ముఖ్యంగా రాత్రి వేళల్లో రోడ్లపై ఆరబెట్టిన పంటలు వాహనదారులకు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. రైతులు తమ పంటలను రహదారులపై ఆరబెట్టడం వల్ల ఇతరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.



**ప్రమాదాల నివారణకు సహకరించాలి**

రైతులందరూ తమ పంటలను రహదారులపై కాకుండా సురక్షితమైన ప్రదేశాల్లోనే ఆరబెట్టుకోవాలని ఎస్ఐ సూచించారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని పోలీస్ శాఖ సూచనలను పాటించాలని కోరారు. రహదారులపై పంటలు ఆరబెట్టి ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యతని, రైతులు పోలీస్ శాఖకు సహకరించి వాహనదారులు, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్ఐ జి. మహేష్ విజ్ఞప్తి చేశారు.



# ప్రజావాణికి మూడు దరఖాస్తులు

**హౌసింగ్, పోలీస్, రెవెన్యూ సమస్యలపై వినతులు**

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 12 (మనం న్యూస్): ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సిరికొండ మండలానికి సంబంధించి మూడు దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో మహమ్మద్ రఫీ అహ్మద్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో హౌసింగ్ శాఖకు సంబంధించి ఒకటి, పోలీస్ శాఖకు సంబంధించి ఒకటి, రెవెన్యూ శాఖకు సంబంధించి ఒకటి చొప్పున మొత్తం మూడు దరఖాస్తులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలను పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.



# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ఐదు రోజుల సమ్మె

**- అక్టోబర్ 13 నుంచి 17 వరకు సమ్మె, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్.**

**- సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి.**

కామారెడ్డి, అక్టోబరు 12(మనం న్యూస్): జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్హెచ్ఎం) పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 13 నుంచి 17 వరకు ఐదు రోజుల సమ్మె నిర్వహించనున్నట్లు ఎన్హెచ్ఎం జేఏసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి సుమన్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్హెచ్ఎం కింద పనిచేస్తున్న 17 వేల మంది ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. వార్షికంగా 5, 8 శాతం బోనస్లు, ఈఎస్ఐ, ఆరోగ్య బీమా సదుపాయాలు కల్పించాలని, మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలు, మంత్రులకు పలుమార్లు సమస్యలను వివరించినా పరిష్కారం లభించకపోవడంతో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పుట్ట మహేంద్రరావు ఆదేశాల మేరకు సమ్మె చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లా జనరల్ సెక్రటరీ పద్మజ, కార్యదర్శి రాజు, మహిళా అధ్యక్షురాలు అశ్విని, మౌనిక, రమణ, శీను, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# బతుకమ్మ పండుగ నేపథ్యంలో పెద్ద చెరువులో పారిశుద్ధ్య పనులు

**జంగంపల్లి గ్రామంలో పారిశుద్ధ్య పనులకు శ్రీకారం చుట్టిన గ్రామ పంచాయతీ**

భిక్కనూర్, అక్టోబర్ 12 ( మనం న్యూస్ ): బతుకమ్మ పండుగను దృష్టిలో ఉంచుకొని భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలోని పెద్ద చెరువులో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పండుగ సందర్భంగా చెరువు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా గ్రామ సిబ్బందితో శుభ్రత పనులు చేయిస్తున్నారు.

బతుకమ్మ పండుగకు మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉండటంతో చెరువు పరిసరాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు గ్రామ పంచాయతీ వర్గాలు తెలిపాయి. పండుగకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీ వాణి వాసు యాదవ్, పంచాయతీ కార్యదర్శి దయాకర్ రెడ్డి, వార్డు సభ్యులు రవీందర్ రెడ్డి, బుచ్చయ్య, బాబు, రవి, బన్నీ, రవి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ వేడుకలకు లైటింగ్ సౌకర్యం కరువు

భిక్కనూర్, అక్టోబర్ 12 ( మనం న్యూస్ ): భిక్కనూర్ పట్టణంలోని గాజులపేట కాలనీకి చెందిన తొమ్మిదో, పదో వార్డుల మహిళలు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బతుకమ్మ పండుగ వేడుకలను ప్రారంభించారు. పండుగలో భాగంగా మహిళలు సాంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో వేడుకల్లో పాల్గొంటున్నారు.

అయితే వేడుకలు జరుగుతున్న ప్రాంగణంలో మహిళలకు అవసరమైన కనీస సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



ముఖ్యంగా తగినంత లైటింగ్ సౌకర్యం లేకపోవడం వల్ల సాయంత్రం వేళల్లో బతుకమ్మ ఆడుకునే మహిళలు అసౌకర్యానికి గురవుతున్నారు.

బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకునే మహిళలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తే వేడుకలు మరింత సౌకర్యవంతంగా సాగుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రాంగణంలో తగిన లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు ఇతర అవసరమైన సౌకర్యాలపై దృష్టి సారించాలని మహిళలు కోరుతున్నారు.

# ఆర్టీఐ చట్టంపై విస్తృత ప్రచారం అవసరం

**- పట్టణ సీఐ నరహరి, రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఏ. సలీం ఆధ్వర్యంలో పోలీస్స్టేషన్లో ఆర్టీఐ వార్షికోత్సవ వేడుకలు.**
**- ఆర్టీఐ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి: రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఏ. సలీం.**



కామారెడ్డి, అక్టోబరు 12(మనం న్యూస్): సమాచార హక్కు చట్టం-2005 ద్వారా ప్రజలకు ప్రభుత్వ వ్యవహారాలపై సమాచారం తెలుసుకునే హక్కు లభించిందని, ఈ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని కామారెడ్డి పట్టణ సీఐ నరహరి అన్నారు. సోమవారం కామారెడ్డి పట్టణ పోలీస్స్టేషన్లో సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్టీఐ 21వ వార్షిక వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. కమిటీ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఏ. సలీంతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నరహరి మాట్లాడుతూ.. పోలీస్స్టేషన్లో సమాచార హక్కు చట్టం అమలుకు అవసరమైన ఏర్పాట్లు ఉన్నాయని తెలిపారు.

**ప్రజలకు గడువులో సమాచారం అందిస్తాం: సీఐ**

ప్రజలు తమకు అవసరమైన సమాచారాన్ని కోరుతూ దరఖాస్తు చేసుకుంటే నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. సమాచారం కోసం పోలీస్స్టేషన్ను సంప్రదించే ప్రజలకు ఆర్టీఐ బోర్డు అందుబాటులో ఉందన్నారు. అందులో ప్రజా సమాచార అధికారి, సహాయ ప్రజా సమాచార అధికారి, అప్పీల్ల అధికారుల పేర్లు పొందుపరిచినట్లు వివరించారు.

**సమాచార హక్కు చట్టంపై అవగాహన**

సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు రాష్ట్ర డైరెక్టర్ సలీంను సీఐ నరహరి శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం సలీం కూడా సీఐ నరహరిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు శివ పూజ లింబయ్య, జోనల్ అధ్యక్షుడు సిర్నాపల్లి ప్రదీప్కుమార్, మీడియా సలహాదారు సయ్యద్ జావిద్, తెలంగాణ క్రైమ్ రిపోర్టర్ పెరియార్ రామస్వామి, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి జిల్లా ప్రతినిధులు రవి, భాస్కర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా సమాచార హక్కు చట్టం 2005 వారోత్సవాలు

బోధన్ అక్టోబర్ 12 ( మనం న్యూస్): సమాచార హక్కు చట్టం అమలు అయి నేటికీ 21 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా న్యాయ సేవా ప్రజా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా ఎ సి పి కార్యాలయం లో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా అధ్యక్షులు చాపల కిరణ్ కుమార్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అక్టోబర్ 12 2005 సంవత్సరం లో అమలులోకి వచ్చిందని అంతకు ముందు ఈ చట్టం కేవలం ప్రజా ప్రతినిధులకు మాత్రమే ఉండేదని అన్నారు ప్రజలు సమాచార హక్కు చట్టం పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ మీర్జాపురం రామ కృష్ణ సభ్యులు కొట్టే శ్రీకాంత్ సాలూరి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 12వసారి రక్తదానం.. ఆదర్శంగా ప్రశాంత్ గౌడ్

**- యువత రక్తదానానికి ముందుకు రావాలి.. రెడ్క్రాస్ జిల్లా సమన్వయ సభ్యుడు డాక్టర్ బాలు.**



కామారెడ్డి: రెడ్డిపేట గ్రామానికి చెందిన ప్రశాంత్ గౌడ్ 12వసారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారని రెడ్క్రాస్ జిల్లా సమన్వయ సభ్యుడు డాక్టర్ బాలు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి రక్తం అందించేందుకు ఏడాదికి మూడుసార్లు రక్తదానం చేస్తున్న ఆయనను అభినందించారు. రక్తదానంపై ఉన్న అపోహలను విడనాడి యువత ముందుకు రావాలని సూచించారు. రక్తదానం చేసే రక్తదాతలకు గుండె జబ్బులు,క్యాన్సర్, కొలెస్ట్రాల్ వంటి సమస్యలను తగ్గించుకోవచ్చు అనే విషయాన్ని తెలుసుకుని రక్తదానానికి ముందుకు రావాలని అన్నారు. రెడ్క్రాస్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని డాక్టర్ బాలు తెలిపారు. తలసేమియా బాధితుల కోసం మరిన్ని రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తామని, అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి రక్తం అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. సేవ చేయడానికి పదవులు అవసరం లేదని, సేవాభావమే ముఖ్యమని ఆయన అన్నారు.

# ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ

**పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం: సర్పంచ్ మాలవత్ సుగుణ**



నిజాంబాద్ రూరల్, అక్టోబర్ 12 (మనం న్యూస్): సిరికొండ మండలంలోని జగదాంబ తాండా గ్రామ పంచాయతీ పరిధిలోని రూప్లా తాండాలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారు మాలవత్ కళావతి ఇంటి నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ మాలవత్ సుగుణ భూమిపూజ నిర్వహించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి ఆదేశాల మేరకు ఇంటి నిర్మాణ స్థలంలో ముగ్గు పోసి, కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.

**పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**

ఈ సందర్భంగా సర్పంచ్ మాలవత్ సుగుణ మాట్లాడుతూ, పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాలకు ఎంతో భరోసానిస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఫాష, కాంగ్రెస్ నాయకులు కిషన్, మోహన్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.